క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తున్నారు


ఎంపీటీసీ రాజేశ్వరి

అల్లవరం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధల సహకారంతో నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీకి చెందినవారు ఆటంకాలు సృష్టిస్తున్నారని ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి అన్నారు. గురువారం తుమ్మలపల్లిలోని తన నివాసంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పంచాయతీకి జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలు కేటాయించినా నేటికీ పనులకు సంబంధించిన తీర్మానాలు ఇవ్వడం లేదన్నారు. నక్కవానిపుంత శ్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్డు అసంపూర్ణంగా ఉన్నా సర్పంచ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత తనపై ఉందని, గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.మంగాయమ్మ తెలిపారు. తాళ్లరేవు, చొల్లంగి గ్రామాల్లో మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రైమరీ ఉపాధ్యాయులకు బదిలీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు డిప్యూటీ డైరెక్టర్ ఎఫ్‌పీ వీరబిన జయరాజ్ ఆదేశాల మేరకు స్థానిక ప్రాంతీయ విద్యాశాఖాధికారి కార్యాలయంలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 176 మంది టీచర్లను జోన్-1, జోన్-2 గా విడదీసి బదిలీలు చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

12 నుంచి స్కూల్ గేమ్స్

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో ఈ నెల 12 నుంచి 14 వరకూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎంఈఓ కిరణ్‌బాబు గురువారం తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులకు కోకో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. ఎంఈఓ వెంట ఎంఈఓ-2 ఏడుకొండలు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.రాము తదితరులున్నారు.

బాధితుడికి వీల్‌చైర్ అందజేత


బాధితుడికి వీల్‌చైర్ అందజేసిన ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: వెన్నెపూస సంబంధిత వ్యాధితో గత ఐదేళ్లుగా మంచానికే పరిమితమైన యానాంకు చెందిన జాస్తి రవీంద్రకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు ఆర్‌ఏఓ మునిస్వామి వీల్‌చైర్ గురువారం అందజేశారు. జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ), వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ట్రెజరర్ ముదునూరి సతీష్‌రాజు ఆధ్వర్యంలో వీల్‌చైర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బి.సుధాకర్, వై.రత్నప్రసాద్, ఎ.శేఖర్, వి.సుబ్బరాజు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర

అమలాపురం టౌన్: కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అమలాపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర గడియారం స్తంభం సెంటరు నుంచి ఈదరపల్లి వంతెన వరకూ సాగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్,మహ్మద్ ఆరిఫ్, వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

తానా సాహిత్య సమ్మేళనానికి సోమశేఖరవర్మ

యానాం: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక సెప్టెంబర్ 9న కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సమ్మేళనానికి యానాంకు చెందిన కవి, తెలుగువెలుగు సాహిత్యవేదిక కార్యవర్గ సభ్యుడు తాతపూడి సోమశేఖరవర్మను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తనకు అవకాశం కల్పించినందుకు సోమశేఖరవర్మ ధన్యవాదాలు తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం: కాకినాడలోని మాధవపట్నం వద్ద ఉన్న 132 కేవీ విద్యుత్ టవర్ మార్చుతున్న నేపథ్యంలో ఈ నెల 9న యానాంలో అన్ని ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అసిస్టెంట్ ఇంజినీరు లంక కృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉట్టి కొట్టిన చిన్ని కృష్ణులు

- అంబరాన్నంటిన కృష్ణాష్టమి సంబరాలు
- వేడుకల్లో సందడి చేసిన చిన్నారులు

అమలాపురం టౌన్/అల్లవరం: ఊరూరా కృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. బుడిబుడి అడుగులు వేసే తమ చిన్నారులను బాల కృష్ణులుగా, గోపికలుగా తయారుచేసి తల్లిదండ్రులు మురిసిపోయారు. సాంప్రదాయం ఉట్టి పడేలా గ్రామాల్లో నల్లనయ్య పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టి సందడి చేశారు. పలు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గురువారం ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కృష్ణాష్టమి సందర్భంగా అమలాపురం పట్టణంలోని మాచిరాజు వీధిలోని ఇస్కాన్ కేంద్రం వద్ద కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కేంద్రం ఇస్కాన్ ఇన్‌చార్జి శివానందనమయి దాస్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణాష్టమి అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వేషధారణ, గాన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం


బోడసకుర్రులో ఉట్టి కొడుతున్న సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు


అమలాపురం ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్న చిన్ని కృష్ణుడు

నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక గొల్లగూడెంలోని శ్రీకృష్ణాలయం ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం జరిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సంస్కార భారతి కోనసీమ జిల్లా శాఖ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కల్యాణ మండపంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్న కృష్ణుడి వేషధారణల్లో చిన్నారులు అలరించారు. స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలుకు చెందిన దాదాపు వంద మంది చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు.

బోడసకుర్రు బాలవికాస్‌లో..

అల్లవరం మండలం బోడసకుర్రు శ్రీసత్యసాయి బాల వికాస్ కేంద్రానికి చెందిన చిన్నారులు కేంద్రం వద్ద కృష్ణాష్టమి సంబరాలను ఉల్లాసంగా జరుపుకున్నారు. అమలాపురం జోనల్ శ్రీసత్యసాయి సేవ సంస్థల కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు కృష్ణాష్టమి విశిష్టతను కథ రూపంలో వివరించారు. వేడుకల్లో చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. బెండమూర్లంక శ్రీకృష్ణాష్టమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సెంటరులో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రం రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గీతా పారాయణం, శ్రీకృష్ణ నామ కీర్తనలతో పూజలు జరిగాయి. దాదాపు 400 మంది బాలబాలికలకు దుస్తులను వితరణగా అందించారు. మధ్యాహ్నం నుంచి జరిగిన అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు గుర్రం రామకృష్ణారావు(సినీ ఆర్టిస్ట్), గుర్రం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం


వన్నె చింతలపూడిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చైతన్యరాజు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడిలో అమెరికా ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను కిమ్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో వన్నె చింతలపూడి గ్రామం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. క్షత్రియ సేవా సమితి ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న నడింపల్లి వెంకటరామరాజును ఆయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రాజరత్న నాగవాణి, ప్రముఖ శాస్త్రవేత్త పరమట రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు పరమట నాగమణి, డాక్టర్ ఎస్.ఎన్.రాజు, నాగేశ్వరరావు, పాలాటి బాలయోగి, పచ్చిమాల బాబ్జి, భూపతి రాజు, త్రిమూర్తులు రాజు పాల్గొన్నారు.

12 నుంచి ఎంపిక పోటీలు

అమలాపురం రూరల్: ఈ నెల 12, 13, 14 తేదీల్లో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు జరగనున్నట్లు ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 12వ తేదీన వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు, 13వ తేదీన బండారులంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, 14వ తేదీన పేరూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోకో, రింగ్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరుగుతాయన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

ఉప్పలగుప్తం: భీమనపల్లి ఉన్నత పాఠశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని మండల విద్యాశాఖాధికారి కిరణ్‌బాబు గురువారం తెలిపారు. అండర్ 14, 17 కేటగిరీల్లో మూడు రోజుల పాటు కోకో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నీకాయిట్, త్రోబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్తి సత్యకృష్ణ, పీడీలు కామన మధుసుదనరావు, గొలకోటి ఫణీంద్రకుమార్, గణపతి, కుమార్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కట్టడికి కళ్లెం పడేనా..?

విజిలెన్స్ తనిఖీలతో అక్రమార్కుల్లో వణుకు

అమలాపురం టౌన్: పట్టణంలో కొత్తగా వెలుస్తున్న భవంతుల్లో సెల్లార్లు వదలకుండా కట్టేస్తుండడంతో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడం వల్ల కాలనీల్లోని వీధులు సైతం ఇరుకిరుకుగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు కొందరు అనుమతులు లేకుండానే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సవా'లక్షల' కారణాలతో నోరెత్తడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిరంతర తనిఖీలతో అక్రమ నిర్మాణాలు చేపట్టే భవన యాజమానుల భరతం పట్టే పరిస్థితి ఉండడం లేదు. ఈ నేపథ్యంలో అమలాపురంలో రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం గురువారం రెండు కమర్షియల్ కాంప్లెక్స్ భవనాల్లో ఆకస్మిక తనిఖీలు చేయడంతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకు మొదలైంది. స్థానికంగా మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పట్టణానికి చెందిన కొందరి ఫిర్యాదుతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారన్న చర్చ పట్టణంలో సాగుతుంది.


అమలాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిన భవనం

జరిమానాలంటే మాకేం భయం

పట్టణంలో కొత్తగా టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకున్న భవన నిర్మాణాల్లో నిబంధనలను ఉల్లంఘించినా అధికారులు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు లేవు. ఎవరి మీదైనా ఫిర్యాదులొస్తేనే కార్యాలయంలోని కుర్చీ కదులుతామన్న రీతిలో టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. అప్పుడైనా ఆయా భవన నిర్మాణదారుడికి నోటీసులిచ్చి మమ అనిపిస్తున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులందుకున్న భవన యజమానుల్లో సైతం ఎలాంటి భయం ఉండడం లేదు. నిబంధనలు ఉల్లంఘించినట్లు రుజువైనా నామమాత్రపు జరిమానాతో సరిపెట్టేస్తుండడమే దీనికి కారణంగా కనిపిస్తుంది. అక్రమ కట్టడాలను గుర్తించినప్పుడు కఠిన చర్యలకు దిగినపుడే పట్టణంలో సక్రమ నిర్మాణాలు జరుగుతాయని పట్టణ ప్రజలు అంటున్నారు.

ఉల్లంఘనలు గుర్తిస్తున్నాం

విజిలెన్స్ అధికారుల బృందం జనరల్ చెకింగ్‌లో భాగంగానే పట్టణంలోని పాత భవనాలను తనిఖీ చేశారు. పట్టణంలో ఎక్కడైనా భవన నిర్మాణాల్లో అనుమతులు ఉల్లంఘిస్తే వాటిని గుర్తించి సంబంధిత భవన యజమానికి నోటీసులిస్తున్నాం. చర్యలకు నివేదికలు తయారుచేస్తున్నాం.

– రాణి సంయుక్త, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, అమలాపురం మున్సిపాలిటీ

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు


ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న యూనివర్సిటీ బోర్డు సభ్యుడు వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న వాసంశెట్టి వెంకటేశ్వరరావుకు గురువారం సంగవరం సచివాలయంలో జిన్నూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, గ్రామస్తులు ఆయనకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు.

విగ్రహానికి అపచారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి విగ్రహానికి అపచారం జరిగింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆంజనేయ స్వామివారి పాదాల వద్ద కోడి కాళ్లు, ఉల్లిపాయలు, బీట్రూట్, పచ్చిమిర్చి, క్యాబేజిలను ఒక కవర్లో పెట్టి స్వామివారి పాదాల చెంత ఉంచాడు. అక్కడే వ్యాపారం చేస్తున్న కొయ్యల దుర్గారావు అది గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి కవరు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం స్థానికులు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసి స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

సీతారాముల్ని దర్శించుకున్న ఎమ్మెల్సీలు


సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేసిన ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, సూర్యనారాయణ

అల్లవరం: మండలంలోని గోడి గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమలను ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణలు గురువారం దర్శించుకున్నారు. దాతలు కట్టా వీరవెంకట సూర్యనరసింహరావు, లక్ష్మీబ్రహ్మానందకుమార్ల సహకారంతో నిర్మించిన ఆలయ ప్రతిష్ఠకు ఎమ్మెల్సీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్సీలకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, దొమ్మేటి వెంకటేశ్వర్లు, రేవు శ్రీనివాసరావు, కడలి సత్యప్రసాద్, జల్లి ఏడుకొండలు, మాకే రమణ తదితరులు స్వామివార్లను దర్శించుకున్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- పేరూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. పేరూరు పరిధిలోని కొంకాపల్లిలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామంలో ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ అరుణడేవిడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చొల్లంగి సుబ్బరామ్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రూరల్ కార్యదర్శి సూదా గణపతి, ఎంపీటీసీ వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు, అప్పారి లక్ష్మీనారాయణ, కట్టా శ్రీనివాస్, వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.


పేరూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

సీనియర్ జర్నలిస్ట్ అప్పారావు మృతికి సంతాపం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ పత్రికల్లో సుమారు 35 ఏళ్ల పాటు పనిచేసి గురువారం అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్ట్ చింతా అప్పారావు(62) మృతికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుతో పాటు యానాం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, ఏపీ మీడియా ఫెడరేషన్, యానాం రిపోర్టర్స్ అండ్ మీడియా అసోసియేషన్, వివిధ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: శ్రీవరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ ఆలమూరులో గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సత్యపద్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీసిద్ధార్థ హైస్కూల్ సమీపంలోని కాలనీలో నిర్మాణం జరుపుకున్న ఈ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శర్మ, కాళ్లకూరి సూరిపండు, వెల్లవలపల్లి చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం యాగశాలను సందర్శించి హోమగుండం వద్ద పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమారాధన జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, కోలా నానీ, రావాడ వెంకట నరేష్, ఉండమట్ల బూరయ్య పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపేట: మండల పరిధిలోని వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సుమారు 1.5 కోట్ల వ్యయం కాగల ఈ ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ వేదపండితుడు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షిత అవధాని ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గనిశెట్టి పుల్లయ్యనాయుడు దంపతులు, పచ్చిపులుసు బుజ్జిబాబు దంపతులు ఉదయం 11.21 గంటలకు శంకుస్థాపన చేయించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దేవదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ త్సామా బాబు, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టా బాబ్జి, రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండారు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కవి పుల్లంరాజు చిరస్మరణీయులు

అమలాపురం రూరల్: కవి తిరుమలరాజు పుల్లంరాజు చిరస్మరణీయులని, ఆయన రచనలు నేటి తరానికి అందించడం మనందరి బాధ్యతని కిమ్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణ రాజు అన్నారు. గురువారం వన్నె చింతలపూడిలో మహాకవి పుల్లంరాజు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రంగాపురం క్షత్రియ మండపంలో జరిగిన సభలో పుల్లంరాజు రాసిన శతకాన్ని కోనసీమ క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ చైర్మన్ జగ్గప్పరాజు, కవి ఎస్ఆర్ఎస్ కొల్లూరి, సప్పా నాగేశ్వరరావు, భూపతి కృష్ణంరాజు పాల్గొన్నారు.

కొత్త ఓట్ల నమోదుపై దృష్టి

రాజోలు: నియోజకవర్గంలో కొత్త ఓట్లు నమోదుపై దృష్టి సారించాలని రాజోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.శివశంకరప్రసాద్ సూచించారు. గురువారం రాజోలు తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఒకే ఇంటి నంబరుతో 10 మంది ఓటర్లు మించకూడదన్నారు. రాజోలు నియోజకవర్గంలో సుమారు 500లకు పైగా అలాంటి ఓట్లు గుర్తించి సుమారు 200 ఓట్లు సవరించామని ఇంకా 353 ఓట్లు ఉన్నాయన్నారు. మోరి, మోరిపోడు, శివకోడుపాలెం పోలింగ్ బూత్‌ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 100 ఏళ్ల పైబడి ఉన్న ఓటర్లను గుర్తించామని, వారిలో చాలామంది ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు అయినవారు అని తెలుసుకున్నామన్నారు. అలాంటి ఓట్లును సవరిస్తున్నామన్నారు. రాజోలు, మలికిపురం తహసీల్దార్లు బి.ఎం.ముక్తేశ్వరరావు, వి.వి.ఎల్.నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్లు చెల్లుబోయిన భాస్కరరావు, శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శివశంకర్ ప్రసాద్

ఉత్తమ సేవలకు గుర్తింపు

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మోడేకుర్రు శివారు కడలివారిపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.సత్యవతి, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ వెటర్నరీ అసిస్టెంట్ అవార్డు అందుకున్న బొక్కే శ్రీనివాస్ అభినందన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మోడేకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో హెచ్‌ఎం సత్యవతి దంపతులను, వీఏ శ్రీనివాస్‌ను సత్కరించారు. హైస్కూల్ హెచ్‌ఎం వీవీఎస్ రామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విరిగిపడ్డ లారీ చక్రాలు

ట్రాఫిక్ జామ్

ఆలమూరు: ఆలమూరు-మండపేట రోడ్డులో ఇసుక లారీ చక్రాలు విరిగిపడిన ఘటనలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం జొన్నాడ నుంచి మండపేట వైపు ఇసుక లోడుతో వెళుతున్న ఆరు యూనిట్ల లారీ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో దేవి థియేటర్ సమీపంలోకి వచ్చేసరికి గోతిలో పడి వెనుక చక్రాలు రెండూ ఊడిపోయాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలగగా పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు. అయితే రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీ పక్క నుంచి మరో లారీ వెళుతూ బురదలో దిగిపోయింది. దీంతో ఇరువైపులా వచ్చే వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం లేక ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు.

20 నుంచి సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్

యానాం: ఎల్‌డీసీ, స్టోర్‌కీపర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ సెక్రటరీ వి.జయశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి చీఫ్ సెక్రటరియేట్, మూడో ఫ్లోర్, ఎ-బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఈ మేరకు అభ్యర్థుల రోల్ నెంబర్ వారీగా షెడ్యూలును విడుదల చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఒక జత సెల్ఫ్ అటెస్టెడ్ జిరాక్స్‌లు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్‌లు, నేటివిటీ, రెసిడెన్స్, కమ్యూనిటీ సర్టిఫికెట్‌లను వెంట తీసుకురావాలన్నారు.